క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది కే1 కాలనీలో నివసిస్తున్న ఫర్వీజ్‌ఖాన్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య అసీనాకు స్థానిక నాయకులు అవతార్ సింగ్, సచివాలయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ పోతిన శారదాదేవి వైఎస్సార్ బీమా నగదు శుక్రవారం అందజేశారు. తక్షణ ఖర్చులకు రూ.10 వేలు అందించగా మిగిలిన రూ.4.90 లక్షలు ఆమె అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు.

ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు రూ.10 లక్షల విరాళం



ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న పైడా కృష్ణ ప్రసాద్

ఆనందపురం: మండలంలోని గంభీరంలో ఉన్న స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు పైడా విద్యా సంస్థల అధినేత, ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్ శుక్రవారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఇక్కడ వయోవృద్ధులు కోసం సంరక్షణ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అందులో వివిధ సౌకర్యాలు సమకూర్చడానికి పైడా కృష్ణ ప్రసాద్ విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జి.సాంబశివరావు, మేనేజింగ్ ట్రస్టీ ఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

351 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులతో తిరుపతి స్వామి, ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో తూడెం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలకు చెందిన 351 మంది విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యుడు తిరుపతి స్వామి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ప్రస్తుతం దేశంలో ప్రబలుతున్న హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి నరసయ్యమ్మ, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది జయకుమారి, లక్ష్మణరావు, దివీస్ ప్రతినిధి కె.నరసింహారావు, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర-2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు శుక్రవారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు ఏప్రిల్ 10వతేదీ లోగా 73370 97256, 73964 44404 ఫోన్ల నంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేష్‌నాయుడు, 2022 మిసెస్ ఉత్తరాంధ్ర విన్నర్ కొణతాల భాగ్య, మిస్ విశాఖ విన్నర్ గౌతమి, ఫౌండేషన్ డైరెక్టర్ సిద్దు పాల్గొన్నారు.

'సిటీస్' పథకంతో స్కూళ్లకు కొత్తరూపు

- రూ.8 కోట్లతో వసతుల కల్పనకు చర్యలు



రూపురేఖలు మారనున్న సంగివలస ఈడబ్ల్యూఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాల



సంగివలస ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

తగరపువలస: రాష్ట్రంలో నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతో కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడుతున్నాయి. కేవలం వసతులే కాకుండా ఇంగ్లిష్ మీడియంలో బోధన, మధ్యాహ్నం పౌష్టికాహారం, యూనీఫారాలు, పాఠ్య పుస్తకాలు, బూట్లు, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీ వంటి అదనపు సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిపోయింది. ఇప్పటికి రెండు విడతల్లో భీమిలి మండలంలో వందలాది పాఠశాలల రూపురేఖలు మారిపోగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో కూడా పాఠశాలలకు అదనపు హంగులు సమకూరాయి. ఈ రెండు విడతల్లో నాడు – నేడు పథకం కింద వసతులు సమకూరాయి.

మిగిలిన పాఠశాలల్లో ఇప్పుడు స్మార్ట్ సిటీల అభివృద్ధిలో భాగంగా 'సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టెయిన్'(సిటీస్) పథకం ద్వారా భీమిలి జోన్ పరిధిలో ఆరు పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి.

రూ.8 కోట్లతో ఆరు పాఠశాలల్లో వసతులు

సిటీస్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరోపియన్ యూనియన్ సహకారంతో జీవీఎంసీలో పలు జోన్‌లలో విద్యాభివృద్ధికి పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నాయి. దీని కోసం జోన్ – 1 భీమిలి పరిధిలో ఆరు పాఠశాలలను ఎంపికచేసి రూ.8 కోట్లు ఖర్చు చేయనున్నాయి. వీటిలో సంగివలస ప్రాథమిక పాఠశాల, ఈడబ్ల్యూఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాల, రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్, కొండపేట ప్రాథమిక పాఠశాల, సీఎంఈ పాఠశాల, పీఎస్ఆర్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సిటీస్ పథకం కింద అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణం, ఫెన్సింగ్‌తో కూడిన ప్రహరీ ఎత్తు పెంపు, గేట్లు, పాఠశాలల ఆవరణలో విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ పనులు సంగివలసలో ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే విద్యార్థులకు నాణ్యమైన విద్యాసేవలు అందుతాయని తల్లిదండ్రులు అంటున్నారు.



ఫెన్సింగ్‌తో పాటు ప్రహరీ ఎత్తు పెంచుతూ రక్షణ

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో బాయి శ్రీను వేసిన మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి శుక్రవారం పరిశీలించారు. ‹నాసిరకం విత్తనంతో పంటకు నష్టం› శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. రెడ్డిపల్లిలోని ప్రైవేటు డీలర్ నుంచి బంపర్ రకం మొక్క జొన్న విత్తనాలు తీసుకుని శ్రీను నాటారు. అవి సరిగా నాటకపోవడంతో రైతు ఆర్థికంగా నష్టపోయాడు.

ఈ క్రమంలో రైతు నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా కమిటీకి సిఫారసు చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూపీహెచ్‌సీల్లో ప్రత్యేక వైద్య సేవలు



వాంబేకాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లో గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) ప్రత్యేక వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక్కడ రోజువారీ సేవలతోపాటు వారంలో ఒక్కోరోజు ఒక్కో వైద్య నిపుణులతో సేవలు అందిస్తున్నారు. మారికవలస ఆర్‌జీకే కాలనీ, స్వతంత్ర నగర్ ఏఎస్ఆర్ కాలనీ, వాంబేకాలనీ, కొమ్మాది (బక్కన్నపాలెం) అమరావతి నగర్, పీఎం పాలెం, మిథిలాపురి వుడా కాలనీ తదితర చోట్ల యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ప్రతీ మంగళవారం సాధారణ, వృద్ధాప్య, శస్త్ర చికిత్స వైద్య సేవలు, బుధవారం శ్వాస కోస వ్యాధులు, చిన్న పిల్లల వైద్యం, గురువారం శస్త్ర చకిత్స, ఎముకల వైద్యం, శుక్రవారం స్త్రీల సమస్యలకు, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు వైద్య నిపుణులు సేవలు అందిస్తారని అధికారులు తెలిపారు. ఆయా యూపీహెచ్‌సీల వైద్యులు మాత్రం రోజంతా అందుబాటులో ఉంటారని, ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

అల్లిపురం: ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన అండిబోయిన కోటేశ్వరరావు (60) సిరిపురం జంక్షన్‌లో గల ఖరాచీవాలాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటీపై విధులకు బయలుదేరాడు. పూర్ణామార్కెట్ నుంచి సీపీ కార్యాలయం జంక్షన్ వైపు వస్తుండగా, 28వ నంబర్ ఆర్టీసీ బస్సు అతనిని బలంగా ఢీకొట్టడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి ఆర్టీసీ బస్ సిబ్బంది గాయపడిన కోటేశ్వరరావును కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో 'నాడు-నేడు' పనుల పూర్తి

- డీఈవో చంద్రకళ ఆదేశం



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. నగరంలోని పలు స్కూళ్లల్లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. గోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులన్నీ ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని వార్డు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు డీఈవో సూచించారు. మధ్యాహ్న భోజన పథకం తయారీ విధానాన్ని పరిశీలించి, నిర్వాహక ఏజెన్సీ వారితో మాట్లాడారు. రుచికరంగా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. తరగతుల్లో డీసీఆర్, వీసీఆర్ వినియోగించకపోవడాన్ని గుర్తించిన ఆమె వీటిని క్రమం తప్పకుండా ఉపయోగించి రికార్డుల్లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల గేటు వద్ద చేపల దుకాణదారులు వ్యర్థాలు వేస్తున్నట్లు గమనించిన డీఈవో.. దీనిపై తగు చర్యల నిమిత్తం జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించారు. ఏరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసు ద్వారా గోపాలపట్నం ఎస్‌ఐ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పాఠశాల గేటు వద్ద వ్యర్థాలు పడేయకుండా దుకాణదారులతో మాట్లాడాలన్నారు. ఇటువంటి వ్యర్థాల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది జోక్యం చేసుకోవాలని డీఈవో చంద్రకళ సూచించారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. శ్రీవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

హిందీ లోయర్ పరీక్షా ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై గత నెలలో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్టు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు సంబంధించి హాజరైన 121 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. రాష్ట్ర భాష పరీక్షకు సంబంధించి ఇద్దరు విద్యార్థులు ఫీజు చెల్లించినా పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

సాయిరాం కాలనీలో 'ఫ్యామిలీ డాక్టర్ సేవలు' నేడు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు సాయిరాం కాలనీలో శనివారం మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించనున్నారు. ఇక్కడి సచివాలయం పరిధిలో రోగులకు, ఇంటిలో మంచానికే పరిమితమైన వారికి సేవలు అందిస్తారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు ఆస్పత్రిలో లేదా సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

దొండపర్తి : టెక్ మహీంద్రా ఫౌండేషన్ వారి సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారి అర్హులన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోరులో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ 9502874304, 9908104113 ఫోన్ నెంబర్లకు ఈ నెల 18వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం

ఆనందపురం : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని భీమిలి డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు సూచించారు. మండలంలోని గిడిజాల ఉన్నత పాఠశాలను శుక్రవారం అధ్యాపక బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్ పొందాలంటే పదో తరగతే పునాది అన్నారు. ఇక్కడ మంచి ఫలితాలు సాధిస్తే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించేటట్టు చూడాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు లిప్ విధానంలో పాఠ్యాంశాల బోధన, 3 నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పాఠ్యాంశాల ప్రణాళికలు, డైరీలను పరిశీలించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ అలాఉద్దీన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నెలల తరబడి తాగునీరు వృథా

- తూతూమంత్రంగా అధికారుల చర్యలు



భీమిలి రోడ్డులోని చిట్టివలస చెరువు వద్ద పైప్‌లైన్ నుంచి చిమ్ముతున్న తాగునీరు

తగరపువలస: స్థానిక గోస్తనీనది తీరం నుంచి భీమిలి మండలం మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీలకు సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ చిట్టివలస చెరువు వద్ద తుప్పుపట్టి నీరు వృథాగా పోతోంది. తిరుమల ఫంక్షన్ హాలు ఎదురుగా మదుము చాటున నెలల తరబడి వేలాది లీటర్ల తాగునీరు ఇలా చెరువులో కలిసిపోతోంది. ఈ రెండు పంచాయతీల ప్రజలు తాగునీటి వృథాపై గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది దృష్టికి తీసుకొచ్చినా శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. తుప్పు పట్టి లీకవుతున్న చోట తాత్కాలికంగా పాలిథిన్ కవర్లు, సిమెంట్ గోనెలు చుట్టి పైన బరువుకు రాళ్లు పెట్టి వదిలేశారు. రానున్న వేసవి కారణంగా ఇప్పటికే గోస్తనీ నదిలో తాగునీటి వనరుల తగ్గుముఖం పడుతున్నాయి. అందువల్ల తాగునీటి వృథాను అరికట్టే చర్యల్లో భాగంగా చెరువు వద్ద తుప్పు పట్టిన పైపులైన్‌ను మార్చాలని మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

సత్యనారాయణ స్వామి కొండపై ప్రహరీ శిథిలం



కొండపై ఆలయం చుట్టూ పడిపోయిన ప్రహరీ

తగరపువలస: స్థానిక రమా సత్యనారాయణస్వామి కొండపై ఆలయం చుట్టూ ప్రహరీ శిథిలమై ఒకవైపు కూలిపోయింది. పలుచోట్ల నేల కుంగిపోయింది. దీంతో కొండపై దర్శనాలు, పెళ్లిళ్ల కోసం వచ్చే భక్తులకు రక్షణ లేకుండా పోయింది. 80 ఏళ్ల క్రితం కొండ శిఖరంపై నిర్మించిన ఆలయ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మెట్ల మార్గం నుంచి శిఖరం వరకు పలుచోట్ల శిథిలాలు కనిపిస్తున్నాయి. కొండవాలు పగుళ్లలో వర్షం నీరు చేరడంతో రాళ్లు ముందుకు తోసుకొస్తూ బండల మధ్య ఖాళీ ఏర్పడుతోంది. అయితే విజయవాడ ఇంద్రకీలాద్రి మాదిరిగా మెట్ల మార్గంలో ఇనుప జాలులు ఏర్పాటు చేసి సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేసి పగుళ్ల నియంత్రించాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం రమా సత్యనారాయణస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ విలీనం చేసుకుని సంగివలస కొత్తమ్మ ఆలయ ఈవో పరిధిలో ఉంచారు. ఆదాయం అంతంతమాత్రంగా ఉన్న ఈ ఆలయానికి దేవాదాయశాఖ వసతులు కల్పించడంతోపాటు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ కార్యవర్గం ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని భక్తులు కోరుతున్నారు.

శిథిల రోడ్డుతో అవస్థలు



గ్రామ ప్రవేశంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

పద్మనాభం: బాందేవుపురం పంచాయతీ విజయరాంపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రవేశం నుంచి చివరి వరకు రోడ్డు సుమారు పది చోట్ల గోతులు పడింది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో చీకటి కావడంతో మార్గం కనిపించక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయరాంపురం గ్రామస్తులు రాకపోకలు సాగించడంతోపాటు బాందేవుపురం, మద్ది గ్రామస్తులు గంధవరం వెళ్లడానికి ఇది దగ్గరి మార్గంగా ఉపయోగపడుతుంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఏయూ సమాచారమ్

'భిన్న వాతావరణాలను తట్టుకునేలా నిర్మాణాలు'



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య సత్యనారాయణరెడ్డి

ఏయూ క్యాంపస్: సముద్రతీర ప్రాంతాలలో వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని, వీటిని తట్టుకుని నిలిచే విధంగా నిర్మాణాలు చేపట్టాలని ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి సత్యనారాయణ సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్'అంశంపై శుక్రవారం జరిగిన ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాలలో జరిగే నిర్మాణాలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో కీలకమన్నారు. సాగర్ సిమెంట్స్ సీనియర్ మేనేజర్(టెక్నికల్ సర్వీసెస్) జనార్దన్ అరుణాచలం మాట్లాడుతూ విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సిమెంట్ నిర్మాణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ పూర్వ ఆచార్యుడు కె.రాజ గోపాల్ మాట్లాడుతూ జియోసింథటిక్ మెటీరియల్‌తో నిర్మించిన కన్నూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ వివరాలను తెలియజేశారు. ఈ సదస్సులో గర్‌వారి వాల్ ఫైబర్ లిమిటెడ్(పూణే) ప్రతినిధి రమేష్ చెట్టి, కెల్లెర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వై.హరికృష్ణ, విభాగ ఆచార్యులు డాక్టర్ ఐ.శివపార్వతి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిభూషణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన శుక్రవారం నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య శశిభూషణరావును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్‌బాబు, పలువురు ఆచార్యులు అభినందించారు.